
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శనివారం 26 అక్టోబరు 2024



ఆ మందు వాడొద్దు..!

- కలుపు మందుతో దుష్పరిణామాలు
- నిస్సారమవుతున్న భూములు
- ప్రజల్లో సైతం ఆరోగ్య సమస్యలు
- అయినా.. యథేచ్ఛగా విక్రయాలు

చేను నిస్సారమవుతుండడం, ప్రజలు రోగాల బారిన పడుతుండడంతో గ్లైఫోసేట్ కలుపు నివారణ మందు వాడొద్దని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది కూడా. అయినా.. పురుగు మందుల షాపుల నిర్వాహకులు చాటుగా వీటిని రైతులకు అంటగడుతున్నారు. తక్కువ రేటుకే వస్తుండడం, ఈ మందు దుష్పరిణామాలపై అవగాహన లేక రైతులు సైతం ఎడాపెడా వినియోగిస్తున్నారు. దీంతో తీవ్ర దుష్పరిణామాలు తప్పవనీ, ఈ మందు విక్రయించినా.., వినియోగించినా.. కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

9



కబళిస్తున్న మట్కా..!



సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ మట్కా



- వ్యసనం బారిన పడుతున్న కూలీలు, చిరుద్యోగులు, యువకులు
- అప్పుల పాలవుతున్న వైనం
- ఆస్తులు అమ్ముకుని.. ఊరు వీడుతున్న దుస్థితి

కొత్తచెరువు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మట్కా మహమ్మారి కుటుంబాలనే కబళిస్తోంది. కూలీలు, యువకులు.. మట్కా బారినపడి సర్వం కోల్పోతున్నారు. అప్పుల పాలవుతున్నారు. మట్కా నిర్వాహకులు సాంకేతికను అందిపుచ్చుకుంటున్నారు. ఆన్‌లైన్ కార్యకలాపాలు, డిజిటల్ చెల్లింపులు సాగిస్తున్నారు. దీంతో మట్కాను అరికట్టడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. కొందరు పోలీసులే.. మట్కా నిర్వాహకులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. వారి నుంచి మామూళ్లు పుచ్చుకుంటూ పోలీసులు దాడి చేసే సమాచారాన్ని చేరవేస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో మట్కా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు.

కూలి పనులు చేసుకునే వారు మొదలుకుని, ఉద్యోగులు, వ్యాపారులు, యువకులు మట్కాకు బానిసలవుతున్నారు.మట్కాలో వందకు వెయ్యి, వెయ్యికి పదివేలు పెద్దమొత్తంలో డబ్బు సంపాదించవచ్చని అ త్యాశకు పోయి.. రోజూ సంపాదించే డబ్బును ఆటలో పెడుతున్నారు. జేబులను ఖాళీ చేసుకుంటున్నారు. జిల్లాలో కార్మికులు ఎక్కువగా ఉన్న ధర్మవరం, పెనుకొండ, కదిరి, హిందూపురం, పుట్టపర్తి, మడకశిరప్రాంతాల్లో ని గ్రామాల్లో ఆన్‌లైన్ మట్కా జోరుగా సాగుతున్నట్లు సమాచారం. నిరుద్యోగులు, ఖాళీగా ఉన్నవారు సునాయాసంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మట్కాకు బానిసలవుతున్నా రు. జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో పలు పేర్లతో మ ట్కా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఓపెన్, క్లోజ్, బ్రాకెట్ 0 నుంచి 999 వరకు నంబర్లపై మట్కా సాగుతున్నట్లు సమాచారం. కొంత మంది పోలీసులు.. మట్కా ఏజెంట్లు, నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకుంటూ వారికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుల దాడుల సమా చారం ఆశాఖ నుంచే మట్కా నిర్వాహకులకు అందుతోందన్న విమర్శలు లేకపోలేదు. జిల్లాలో మట్కా మూడు ఓపెన్లు, ఆరు క్లోజ్‌లు అన్నట్లు సాగుతోంది.

ఆన్‌లైన్ మట్కా

ఒకప్పుడు ఒకచోటగుంపుగా చేరి, చిట్టీలపై నంబర్లతో సాగిన మట్కా.. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంది. జిల్లాలో సెల్‌ఫోన్ ద్వారానే మట్కా దందా సాగిస్తున్నట్లు సమాచారం. ముంబై నుంచి సెల్‌పోన్ మెసేజ్ ద్వారా ఓపెన్, క్లోజ్ నంబర్లపై మట్కా సాగుతోంది. మట్కా వాట్సాప్ ద్వారా నిర్వహిస్తూ.. చెల్లింపులకు ఫోన్ పే, గూగుల్ పే, మొబైల్ బ్యాంకింగ్ వంటి వాటిని వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా రూ.కోట్లల్లో దందా సాగుతోంది. పోలీసులు అడపాదడపా దాడులు చేస్తున్నా.. మట్కాను నియంత్రించలేకపోతున్నారు. ఒకరిద్దరిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు నిర్వాహకులపై మాత్రం చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

పీడీ యాక్టు అమలు చేస్తాం: ఎస్పీ రత్న

జిల్లాలో మట్కాపై నిఘా పెట్టాం. మట్కా ఆడేవారిపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నాం. కఠిన చర్యలు తీసుకుంటాం. పీడీ యాక్టు సైతం అమలు చేస్తాం.

కొత్తచెరువు మండలానికి చెందిన ఓ పారిశుధ్య కార్మికుడు వచ్చే చిన్నపాటి వేతనంతో జీవనం సాగించేవాడు. మట్కాకు బానిసయ్యాడు. రోజూ ఆడుతుండేవాడు. అలా.. డబ్బులు కోల్పోయి, అప్పులపాలయ్యాడు. ఆఖరుకు ఇల్లు, భూమిని అమ్మేసుకున్నాడు. ఆయన కూడా అనారోగ్యంతో నెలల క్రితం మరణించాడు.

కొత్తచెరువు మండలానికి చెందిన గీత కార్మికుడు రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ముతో మట్కా ఆడేవాడు. దానికి పూర్తిగా బానిసయ్యాడు. ఆఖరుకు మట్కాలో డబ్బు పోగొట్టుకుని, అప్పుల పాలై ఊరు వదిలాడు. ఇలా జిల్లాలో ఊరూరా మట్కా బాధితులున్నారు.

మక్కువే... నటుడిని చేసింది..

- సినీరంగంలో రాణిస్తున్న గోరంట్ల వాసి ఖగేంద్ర
- ప్రముఖ నటులతో కలిసి సినిమాలు



విజేత

శతఘ్నుడి పాత్రలో..

గోరంట్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన జిల్లాలో పుట్టి, సినీరంగంలో.. అదీ ప్రముఖ నటులతో కలిసి నటించడమంటే ఆషామాషీ కాదు. ఊహకు కూడా అందదు. అలాంటి దానిని సుసాధ్యం చేసుకున్నాడు గోరంట్లకు చెందిన చిట్టా ఖగేంద్ర. ప్రముఖ నటులతో కలిసి సినిమాల్లో నటించారు. ప్రజాదరణ పొందిన సీరియళ్లలో సైతం నటనా పాటవాలును ప్రదర్శించారు. నటనపై మక్కువే ఈ స్థాయికి చేర్చిందంటున్న ఖగేంద్ర విజయ ప్రస్థానం తెలుసుకుందాం..

తొలి అవకాశం..

గోరంట్లకు చెందిన గౌరమ్మ, టైలర్ అంజనేయులు దంపతుల కుమారుడు ఖగేంద్ర. గోరంట్లలోని ఎస్ఎపీఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో 1990లో ఇంటర్ చదువుతుండగా.. తొలి సారి నటించారు. తండ్రి ప్రోత్సాహంతో పల్నాటి బ్రహ్మనాయుడు ఏకపాత్రాభినయాన్ని ప్రదర్శించారు. కంఠస్వరం, హావభావాలు బాగున్నాయని టీచర్లు ప్రోత్సహించారు. దీంతో నటన పట్ల ఖగేంద్ర ఆకర్షితుడయ్యారు. ఆసక్తి పెంచుకున్నారు. జీవనాధారం కోసం గోరంట్ల స్టూడియోలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేశారు. 1999లో ప్రముఖ సినీనటి అంజలీదేవి నిర్మాణ సారథ్యంలో పుట్టపర్తి శ్రీసత్యసాయిబా కథలపై తీసున్న టెలీఫిల్మ్‌లో నటించే అవకాశం లభించింది.



ఖగేంద్ర

ప్రముఖ సినీనటుల సరసన..

తొలి అవకాశాన్ని ఖగేంద్ర అందిపుచ్చుకున్నారు. సద్వినియోగం చేసుకున్నారు. మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం ప్రముఖ సినీనటులు సాయికుమార్, మురళీ మోహన్, భానుచందర్‌తో కలిసి నటించారు. 2006లో చిరంజీవులు టెలీఫిల్మ్‌లో ప్రధాన పాత్రలో మాంత్రికుడిగా నటించారు. పలు సీరియళ్లలో సైతం నటనతో అలరించారు.

సినిమా అవకాశం వచ్చిందిలా..

2014లో బెంగళూరులో దర్శకుడు శ్రీనివాస్ గినిశెట్టి నేతృత్వంలో కన్నడ సినిమాలో నటించే అవకాశం వచ్చింది. తెలుగులో శ్రీవరసిద్ధి వినాయక సినిమాలో ప్రధాన పాత్ర, శతఘ్నుడుగా నటించారు. తరువాత లోకల్‌గా శ్రీకాడిమాను ఆంజనేయస్వామి చరిత్ర, ఆశయం టెలీఫిల్మ్‌లో పనిచేశారు. 2020 వాస్తు పొన్నూరి దర్శకత్వంలో ప్యాక్షన్‌లేని సీమకథలో రాజకీయ నాయకుడి పాత్ర పోషించారు. నాగలి పోటు, మిస్టర్ కృష్ణ షార్ట్ ఫిల్మ్‌లకు దర్శకుడిగా వ్యవహరించారు. కాసేపు మాట్లాడుకుందాం, మిస్సమ్మలో నటించి, మెప్పించారు. అలా తన కలలను సాకారం చేసుకున్నారు.



మాంత్రికుడి పాత్రలో...

కుదరని బేరం..!

- బాణసంచా దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ
- లైసెన్సుల జారీలో తీవ్ర జాప్యం
- మిగిలింది ఐదు రోజులే..
- వ్యాపారుల్లో ఆందోళన
- వసూళ్లకు తెరలేపిన దళారులు
- అధికారుల మౌనం
- జోరుగా బేరసారాలు



పుట్టపర్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ దగ్గరపడుతోంది. ఐదు రోజులే మిగిలి ఉంది. బాణసంచా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. దరఖాస్తు గడువు ముగిసి 20 రోజులు దాటింది. కలెక్టరేట్‌కు వచ్చిన దరఖాస్తులను ఆయా రెవెన్యూ డివిజన్ల నుంచి పట్టణ, మండల కేంద్రాల జాబితా పంపారు. దరఖాస్తులు, స్థల పరిశీలన సైతం పూర్తి చేశారు. ఆ తర్వాత అటకెక్కించారు. పండుగ దగ్గర పడుతున్నా దుకాణాల ఏర్పాటుకు లైసెన్సులు మంజూరు చేయడంలో అధికారులు అదిగో.. ఇదిగో అంటూ కాలం గడిపేస్తున్నారు. ఈనేపథ్యంలో బాణసంచా దుకాణాల తాత్కాలిక లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్న వ్యాపారులు.. ఆయాశాఖల అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. దీపావళి పండుగ దగ్గర పడేకొద్దీ టపాసుల వ్యాపారుల్లో టెన్షన్ పెరిగిపోతోంది.

వసూళ్లకు వేళాయె..

దీపావళి వచ్చిందంటే చాలు కొన్ని శాఖలకు పండుగే. బాణసంచా దుకాణాలకు అనుమతుల మంజూరులో భారీగా ఆమ్యామ్యాలు ముట్టజెప్పాల్సిందేనన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. బాణసంచా దుకాణాల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా పరిశీలించి, నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇవ్వాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు శాఖల వారీగా చలానాల రూపంలో రుసుం చెల్లించాలి. సంయుక్తంగా స్థలాన్ని పరిశీలించిన తరువాతే దరఖాస్తుల ప్రక్రియ ముందుకు కదులుతుంది. అగ్నిమాపక శాఖ ఇచ్చే ఎన్‌ఓసీని కలెక్టరేట్‌కు సమర్పిస్తే అక్కడి నుంచి సబ్ డివిజన్ వారీగా అనుమతి పత్రాలు వెళ్తాయి. సబ్ డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, మండలస్థాయిలో తహసీల్దార్లు.. సంబంధిత టపాసుల వ్యాపారికి విక్రయాలకు స్థలం మంజూరు చేస్తారు. దుకాణాలకు స్థలం కేటాయింపులో పోటీ వస్తే లక్కీడిప్ తీస్తారు. దుకాణాలకు అనుమతుల మంజూరులో జాప్యంతో వ్యాపారుల్లో కొందరు దళారుల అవతారమెత్తి ఒక్కో దుకాణం నుంచి రూ.50 వేల నుంచి రూ.రెండు లక్షలదాకా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. ప్రధానంగా హిందూపురం, ధర్మవరం, కదిరిలో టపాసుల దుకాణం ఏర్పాటు చేయాలంటే అంత ఈజీగా అనుమతులు రావని ఆ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఓ శాఖ ముందస్తుగానే దరఖాస్తుదారుల నుంచి ముక్కుపిండి వసూలు చేసి, పట్టనట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దరఖాస్తుదారుల్లో నేరప్రవృత్తి ఉన్న వారున్నారా అని పరిశీలించి, పోలీసు శాఖ జాబితా ఇవ్వాల్సి ఉంది. శుక్రవారం నాటికి ఇంకా స్పష్టతరాలేదు. ఈనేపథ్యంలో ఎవరెవరికి అనుమతులు వస్తాయోనని వ్యాపారుల్లో టెన్షన్ పట్టుకుంది. దీపావళి దగ్గర పడుతున్న నేపథ్యంలో బాణసంచా వ్యాపారులకు అనుమతులిప్పించేందుకు కొందరు దళారులతోపాటు అధికార పార్టీ నేతలు బేరసారాలకు దిగుతున్నారు. దుకాణాల లైసెన్సుల జారీపై పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని శాఖలు ఆడిందే ఆటగా తమారైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మిగిలింది ఐదురోజులే..

జిల్లాలో బాణసంచా లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్నా.. గ్రీన్‌సిగ్నల్ రాలేదు. హిందూపురంలో 56 కదిరి 40, ధర్మవరం 41, పెనుకొండ 13, పుట్టపర్తి 11, మడకశిరలో 4 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా పోటీపడి 300 దరఖాస్తులు చేశారు. జిల్లావ్యాప్తంగా దరఖాస్తుదారులతో సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఆ పరిస్థితులు కన్పించట్లేదు. జిల్లాలో టపాసుల నిల్వ లైసెన్సులు హిందూపురం ప్రాంతంలో కొందరికే ఉన్నాయి. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వారికి నెలరోజులకు మాత్రమే తాత్కాలిక లైసెన్సు మంజూరు చేస్తారు. అయినా చాలామంది వ్యాపారులు టపాసులు తీసుకువచ్చి ఆయా పట్టణ, గ్రామాల్లో నిల్వ చేసుకున్నారు. దుకాణాలకు అనుమతులొస్తాయో.. లేదో.. అన్న టెన్షన్ ఓవైపు.. ఎక్కడ అధికారులు దాడులు చేస్తారోనన్న ఆందోళన మరోవైపు వ్యాపారులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. గత నెలలో జిల్లావ్యాప్తంగా బాణసంచా అక్రమ నిల్వలపై తనిఖీలతో ఉక్కుపాదం మోపిన పోలీసు శాఖ ప్రస్తుతం ముందస్తు నిల్వలపై చర్యలు చేపట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది.

అంతా పారదర్శకంగానే..: కొండయ్య, డీఆర్వో

జిల్లాలో బాణసంచా దుకాణాలకు లైసెన్సు మంజూరు ప్రక్రియ పారదర్శకంగా సాగుతోంది. దరఖాస్తులను ఆయా రెవెన్యూ డివిజన్ కార్యాలయాలకు పంపాం. సంబంధిత శాఖల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయింది. త్వరలోనే లైసెన్సులు మంజూరు చేస్తాం.

లెక్క తేలుద్దాం..!

- పశుగణనకు సర్వం సిద్ధం
- సర్వే ప్రారంభం
- ప్రత్యేక సిబ్బంది నియామకం
- మొదటిరోజు సర్వర్ సమస్య



హిందూపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల లెక్క తేల్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. జాతీయ పశుగణనలో భాగంగా శుక్రవారం నుంచి ఇంటింటి సర్వే చేపట్టారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకోసం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను అధికారులు నియమించారు. తొలుత సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అనివార్య కారణాలవల్ల వాయిదా పడింది. తాజాగా పశువులు, జీవాలు, గుర్రాలు, పందులు, కుందేళ్లు, బాతులు, కుక్కలు, ఇతర జంతువులు, కోళ్లు తదితరాలను కలిపి మొత్తం 36 రకాల పశువులను లెక్కించనున్నారు. రైతు ఇంటివద్దే అన్నింటినీ లెక్కించి ఇంటర్నెట్‌లో నమోదు చేస్తారు. దీంతోపాటు పశుసంవర్ధక శాఖ అందజేసిన సామగ్రిని కూడా లెక్కిస్తారు.

సిబ్బంది నియామకం

పశుగణన చేపట్టేందుకు జిల్లాలో సిబ్బందిని నియమించారు. 55 మంది సూపర్‌వైజర్లు, 209 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. నలుగురు డీడీలు నిత్యం పర్యవేక్షిస్తుంటారు. వీరంతా ఇళ్ల వద్దకెళ్లి, పశువులు, పక్షుల వివరాలు సేకరించాలి. ఒకవేళ ఏ ఇంటిలోనైనా పశువులు, పక్షులు లేకపోతే ఆ ఇంట్లో రైతులకు చెందిన వ్యవసాయ పనిముట్లను కూడా ఆరాతీయాల్సి ఉంటుంది.

పథకాల అమలుకు కీలకం

జాతీయస్థాయిలో చేపడుతున్న పశుగణన కారణంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పశుసంవర్ధకశాఖ నుంచి ఏకంగా 11శాతం ఆదాయం రాష్ట్రానికి లభిస్తుంది. జిల్లాలో పశుపోషణ ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5 లక్షల మందిదాకా ఆధారపడి జీవిస్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం అమలుచేసే కార్యక్రమాలకు ఇప్పుడు చేపడుతున్న పశుగణన ఎంతగానో దోహదపడనుంది. పశుపోషకుల ద్వారా వచ్చే ఆదాయం పెంచేందుకు కూడా అవకాశం ఉంటుంది. వారి అవసరాల దృష్ట్యా పథకాలు కొనసాగించేందుకు, ఇంకా కొత్త పథకాలు తీసుకొచ్చేందుకు వీలుంటుంది. నాలుగు నెలలకుపైగా చేపట్టే పశుగణనకు ప్రత్యేక యాప్‌కూడా రూపొందించారు.

జిల్లాలో పశువుల వివరాలు

జిల్లాలో 2019 పశుగణన లెక్కల ప్రకారం ఆవులు, ఎద్దులు, గేదెలు 3.5 లక్షలదాకా ఉన్నాయి. గొర్రెలు, మేకలు 32 లక్షలదాకా ఉన్నాయి. కోళ్లు 14 లక్షలకు పైగా ఉన్నాయి. వీటితోపాటు జంతువులు సుమారు అన్ని రకాలు కలిపి 5 లక్షలదాకా ఉండవచ్చని అంచనా. ప్రస్తుతం చేపడుతున్న పశుగణన పూర్తయితే వీటి లెక్క తేలనుంది.

తొలిరోజు సర్వర్ సమస్య

పశుగణనకు తొలిరోజు శుక్రవారం సర్వర్ సమస్య తలెత్తింది. పశుగణన కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ దేశవ్యాప్తంగా పనిచేయలేదు. దీంతో తొలిరోజు జిల్లాలో ఎక్కడా పశుగణన చేపట్టలేదని ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

ప్రజలు సహకరించాలి

జిల్లాలో పశుగణన పక్కాగా సాగాలంటే ప్రజలు సహకరించాలి. పల్లెలతోపాటు పట్టణాల్లో అపార్టుమెంట్లలో ఉన్నవారు.. సిబ్బంది ఇంటివద్దకు వెళ్లినపుడు వారికి పూర్తి సమాచారం ఇవ్వాలి. అలా ఇస్తేనే పక్కాగా లెక్క తెలిసే అవకాశం ఉంది. పశుగణన ప్రచారంలో భాగంగా కిట్లు, ఐడీ కార్డులు, ప్రతి ఇంటికి పోస్టర్లు అతికిస్తాం.

- డా.శుభదాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

పురానికి ఫుట్‌బాల్ పండుగ

- రాష్ట్రస్థాయి అండర్-14 పోటీలు ప్రారంభం

హిందూపురం అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణానికి ఫుట్‌బాల్ పండుగొచ్చింది. స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్-14 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 520 మంది బాలిబాలికలు వచ్చారు. మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు క్రీడాజ్యోతిని వెలిగించి, పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమన్నారు. అనంతరం క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ డీఈ రమేష్‌కుమార్, నాయకుడు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న కమిషనర్ తదితరులు





మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

29 నుంచి సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు క్రీడాపోటీలు

కొత్తచెరువు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల జిల్లాస్థాయి క్రీడాపోటీలను ఈనెల 29వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఉదయ్‌బాస్కర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. 19 విభాగాల్లో పోటీలను పెనుకొండ కేవీకే, ధర్మవరంలోని కళాజ్యోతిలో నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన వారు నవంబరు 6వతేదీ నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. ఆసక్తిగల అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విచారణ తుస్సు

- కలెక్టర్ ఆదేశాలతో డీఈఓ విచారణ
- నేటికీ చర్యలు లేకపోవడంపై అసహనం
- మళ్లీ ఫిర్యాదు చేసేందుకు పాఠశాలల చైర్మన్లు సిద్ధం

నాడు- నేడు పనులపై అవినీతి ఆరోపణలు



అక్రమాలపై విచారణ చేస్తున్న అప్పటి డీఈఓ వరలక్ష్మి



కమ్మూరు పాఠశాలలో దెబ్బతిన టైల్స్

కూడేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాడు- నేడు పనుల్లో అవినీతి జరిగిందన్న ఫిర్యాదులపై జరిగిన విచారణ తుస్సు మందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో నాడు-నేడు పేరుతో పాఠశాలల అభివృద్ధి పనులు చేపట్టారు. మొదట విడతగా 2021-22లో మండలంలో గొట్కూరు, ఇప్పేరు, ముద్దలాపురం, ఉదిరిపికొండ, జల్లిపల్లి, అరవకూరు, కమ్మూరు, కొర్రకోడు, కూడేరు ఎస్టీ కాలనీ పాఠశాలలతోపాటు కేజీబీవీలో పనులు చేపట్టారు. ఒక్కో పాఠశాలకు రూ.16 లక్షల నుండి రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు టీడీపీ నాయకులు ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలకు అర్జీలు అందించారు. దీంతో కలెక్టర్ వినోద్‌కుమార్ అక్రమాలపై విచారణ చేపట్టాలని డీఈఓను ఆదేశించారు. డీఈఓ వరలక్ష్మి ఆగమేఘాలపై జూలై నెలలో విచారణ చేపట్టారు. కూడేరు మండలం కమ్మూరు, కూడేరు ఎస్టీ కాలనీ, కమ్మూరు ప్రాథమిక పాఠశాల్లో జరిగిన పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించడం, రికార్డులు సక్రమంగా లేకపోవడం, ప్రధానోపాధ్యాయులు, చైర్మెన్లు ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై ప్రస్తుత పాఠశాలల చైర్మన్లు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పై మరోసారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు గ్రామస్థులతో కలిసి సిద్ధమవుతున్నారు.

టైల్స్ పగిలిపోయాయి



పాఠశాల ఆవరణలో నాడు-నేడు కింద అమర్చిన టైల్స్ అప్పుడే పగిలిపోయాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసిన నాసిరకంగా పనులు చేశారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. అక్రమాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

- దేవేంద్ర (కమ్మూరు ప్రాథమిక పాఠశాల చైర్మన్)

చర్యలు ఏవీ..?



కూడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో అక్రమాలు జరిగినట్లు గతంలోనే ఆరోపణలు వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తే అక్రమాలు బయటకు వస్తాయి. కానీ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కాలేదు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేయాలి.

- బోయ రాము (జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్)

డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేస్తాం



కూడేరు ఎస్టీ కాలనీ పాఠశాలలో జరిగిన పనుల్లో అక్రమాలు జరిగినా అధికారులు విచారణ చేసి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేస్తాం. ప్రభుత్వం నాడు- నేడు పనులపై విచారణ చేసి అక్రమాలు వెలికి తీయాలని ఆదేశిస్తే, అధికారులు ఎందుకు విచారణ చేయలేదు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తాం.

- రాము (ఎస్టీ కాలనీ పాఠశాల చైర్మన్)



ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న కుళ్లాయిస్వామి

గుంతకల్లు టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూనివర్శిటీల్లో ప్రొఫెసర్ పోస్టులు చాలావరకు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని అన్నారు. అలాగే డిగ్రీ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి పరీక్షతో సంబంధం లేకుండా విశ్వవిద్యాలయాల్లో చదువుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, వెంకట్‌నాయక్, కోశాధికారి అఖిల్, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులకు నిర్వహించనున్న ఉచిత డీఎస్సీ కోచింగ్ దరఖాస్తు గడువు పొడిగించినట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె స్పష్టం చేశారు. ఇదివరకు ఈ నెల 25వ తేదీన ఉన్న చివరి గడువును ఈ నెల 27 వరకు పొడిగించామన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం

కలెక్టరు వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అన్నివిధాలుగా ప్రోత్సహిస్తామని కలెక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, పరిశ్రమలశాఖ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుచేయించి యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి అవకాశాలు సృష్టించే తయారీ, సేవారంగ పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటూ సహకారం అందిస్తామన్నారు. ఇండస్ట్రియల్స్ పాలసీలో మంజూరైన యూనిట్లను ఆయాశాఖలు సమన్వయంతో అమలు జరిగేలా చూడాలన్నారు. మంజూరైన యూనిట్లకు సంబంధించిన రూ.32లక్షల సబ్సిడీ సొమ్ము మంజూరుకు కమిటీలో ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలశాఖ అధికారి శ్రీధర్, ఎల్‌డీఎం నర్సింగరావు, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ కమర్షియల్‌ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ మురళీమోహన్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణన పక్కాగా చేపట్టాలి..

అఖిలభారత పశుగణన కార్యక్రమాన్ని పక్కాగా కొనసాగించాలని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పశుగణనపై సంబంధిత అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అక్టోబరు 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు పశుగణన కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లాలోని 31మండలాలలో 493 పల్లెలోని ప్రతి ఇంటికి వెళ్లి పశుగణన చేయాలన్నారు. కార్యక్రమం పూర్తయిన వెంటనే ఆయా ఇళ్ల తలుపు కుడివైపున స్టిక్కర్లు అతికించాలన్నారు. పశుగణనలో పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, వివిధ రకాల కోళ్లు సహా పెంపుడు కుక్కలను జాతులవారీగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, డీడీ రమేష్‌రెడ్డి, ఏడీలు శ్రీలక్ష్మీ, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతమ్ముళ్ల మధ్య 'బెల్ట్' గొడవ

- ఒకరిపై ఒకరు దాడులు..
- కారు అద్దాలు ధ్వంసం



దాడిలో ధ్వంసమైన కారు

యల్లనూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో బెల్ట్‌షాపు విషయంలో తెలుగుతమ్ముళ్లు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గొడ్డుమర్రిలో రెండురోజుల క్రితం గ్రామం నడిబొడ్డున బెల్ట్‌షాపు వెలసింది. ఈ షాపును టీడీపీకి చెందిన యోగానందరెడ్డి వర్గీయులు ఏర్పాటు చేశారు. అయితే అదే పార్టీలోని పుల్లయ్య వర్గీయులు ఆ బెల్ట్‌షాపు ఏర్పాటుపై అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు పుల్లయ్య వర్గీయులు సమాచారం ఇచ్చారనే విషయంపై శుక్రవారం సాయంత్రం ఇరువర్గాల నడుమ స్వల్ప ఘర్షణ జరిగింది.

ఈ ఘర్షణ చిలికి చిలికి గాలివానగా మారి ఒకరిపై ఒకరు దాడులు చేసుకునేవరకు వెళ్లింది. ఈ దాడుల్లో ఒక వర్గానికి చెందిన వారి కారు కూడా ధ్వంసమైంది. ఎస్‌ఐ రాంప్రసాద్ హుటాహుటిన గ్రామానికి చేరుకుని వారిని చెదరగొట్టారు. అనంతరం పుల్లయ్య, యోగానందరెడ్డిని విచారించారు.

స్కూల్ బస్సు అద్దాలు ధ్వంసం



ధ్వంసమైన బస్సు అద్దాలు

యాడికి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగర్‌సిమెంట్ ఫ్యాక్టరీ వారు స్కూల్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్సు అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ సంఘటన కుందనకోట గ్రామంలో జరిగింది. గుడిపాడు గ్రామానికి చెందిన రాముడు అనే వ్యక్తి సాగర్‌సిమెంట్స్‌లో బస్సు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ బస్సును సిమెంట్ ఫ్యాక్టరీ వారు కుందనకోట నుంచి యాడికిలోని పాఠశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థుల కోసం ఉచిత సర్వీసుకు ఇచ్చారు. కుందనకోటకు చెందిన విద్యార్థులు ప్రతిరోజూ ఆ బస్సులో యాడికిలోని వివిధ పాఠశాలలకు వచ్చి వెళ్తుంటారు. కాగా గురువారం పాఠశాలల సమయం ముగిసిన తర్వాత యాడికి నుంచి బస్సులో విద్యార్థులను కుందనకోటకు తీసుకెళ్లారు. ఆ తర్వాత బస్సును అక్కడే పార్క్ చేశారు. అయితే రాత్రివేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. బస్సు అద్దాలు పగలడంతో శుక్రవారం విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోయారు. దీనిపై బస్సు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్సు అద్దాలు పగలగొట్టడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



సాగైన కందిపంట

కంది పోతోంది

- కంది పంటపై తెగుళ్ల దాడి
- ఆందోళన చెందుతున్న రైతులు



మందు పిచికారి చేస్తున్న రైతు

ఉరవకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కంది పంటపై తెగుళ్ల దాడి ఉధృతమైంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఉరవకొండ డివిజన్ పరిధిలో కంది సాగు గణనీయంగా పెరిగింది. ఉరవకొండలో 5,900హెక్టార్లు, విడపనకల్లులో 18వేల ఎకరాలు, వజ్రకరూరు మండలంలో 25వేల ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట పూత, పిందె దశలో ఉంది. పంటకు ఆకుపచ్చపురుగు, మరకమచ్చ పురుగులు ఆశిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లోని రాగులపాడు, ప్యాపిలీ, తట్రగల్లు, గంజికుంట, ఉరవకొండ ప్రాంతాల్లో తెగుళ్ల బెడద అధికంగా ఉంది. దీంతో రైతులు తెగుళ్ల నివారించేందుకు రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పంట ఆశాజనకంగా ఉంటుదని రైతులు ఆశించారు. అయితే తెగుళ్ల దాడితో పూత, పిందెలు దెబ్బతింటున్నాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు. పంట ఎదుగుదలకు అవసరమైన మందులతో పాటు తెగుళ్లకు అదనంగా మందులను పిచికారీ చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు అదనంగా రూ. వెయ్యి పెట్టాల్సి వస్తోందని చెబుతున్నారు. ఆకుపచ్చ పురుగుల నివారణకు ఒక లీటర్ నీటికి 2ఎంఎల్ ఫినాల్‌ఫాస్, క్లోరో ఫైరిపాస్ మందులను పిచికారీ చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మరక మచ్చ పురుగు ఉన్నట్లయితే ఒక లీటర్ నీటికి, 1ఎంఎల్ నోవా లిరన్ మందును పిచికారీ చేయాలని రైతులకు సూచిస్తున్నారు.



ఆకుపచ్చ పురుగును చూపుతున్న రైతు

తెగుళ్లతో నష్టపోతున్నాం



తెగుళ్ల పంటకు సోకి నష్ట పోతున్నాం. పంట ఎదుగుదలకు అవసరమైన మందులతో పాటు అదనంగా తెగుళ్ల నివారణకు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ప్రస్తుతం పంట పూత పిందె దశలో ఉంది. దిగుబడి బాగా వస్తుందన్న సమయంలో తెగుళ్లతో నష్టం కలుగుతోంది.

- రవీంద్ర, రైతు, ఉరవకొండ

వేరుశనగ వదిలి కంది సాగు చేస్తే



వేరుశనగ వల్ల తరచూ నష్టాలే వస్తుండటంతో ఈ ఏడాది కందిపంటను 13ఎకరాల్లో కంది సాగు చేశా. పంట ఆశాజనకంగా ఉన్న సమయంలో తెగుళ్ల సోకడం వల్ల దిగుబడి తగ్గే అవకాశముంది. తెగుళ్ల నివారణ మందుల కోసం రూ.15వేల దాకా ఖర్చు అయ్యింది. తెగుళ్ల రూపంలో నష్ట పోవాల్సి వస్తోంది.

- మల్లికార్జున, రైతు, రాగులపాడు

ఇంకెప్పుడు?

నేటికీ విడుదల కాని మార్గదర్శకాలు

సూక్ష్మ సేద్య పరికరాలకు పాత సబ్సిడీనే
కొత్త ధరలపై అన్నదాతల ఆశలు
ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలంటున్న వైనం

అనంతపురం అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు డ్రిప్ లక్ష్యాన్ని భారీగా ఇచ్చారు. అయితే ఇంత వరకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేయలేదు. దీంతో రైతులతో పాటు అధికారులు అయోమయంలో పడ్డారు. జిల్లాకు 37500 హెక్టార్లల్లో డ్రిప్ మంజూరు కోసం ఈ ఏడాది ఆగస్టులో ఉత్తర్వులు జారీ చేశారు. అదే నెలారంభం నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా డ్రిప్ పరికరాల కోసం రైతులు పెద్ద సంఖ్యలోనే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే కొత్త గైడ్ లైన్స్‌ను జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు పాత గైడ్‌లైన్స్ మేరకే రైతులతో నాన్ సబ్సిడీ డబ్బులు కట్టించుకున్నారు. డ్రిప్ అత్యవసరం కావడంతో రైతులు తప్పని పరిస్థితుల్లో పాత సబ్సిడీ అయినా నాన్‌సబ్సిడీ సొమ్మును చెల్లిస్తున్నారు. తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరి నాలుగు మాసాలు గడుస్తున్నా ఇప్పటి దాకా డ్రిప్ కొత్త సబ్సిడీ ధరలు ఖరారు చేయకపోవడంపై రైతులు నిట్టూరుస్తున్నారు. తమ పాలనలో ఏవిధంగా డ్రిప్ మంజూరు చేశామో అధికారంలోకి వస్తే మళ్లీ అదే పద్ధతిలో ఇస్తామని గత సార్వత్రిక ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.



భారీగా రిజిస్ట్రేషన్లు

ఈ ఏడాది ప్రభుత్వం జిల్లాకు భారీగానే డ్రిప్, స్ప్రింక్లర్ల లక్ష్యాన్ని విధించింది. ఉమ్మడి అనంత జిల్లాకు గతంలో అత్యధికంగా 23వేల హెక్టార్ల లక్ష్యం విధించారు. ఇందులో అనంత జిల్లా 13వేల హెక్టార్లు ఉండింది. ఈ సారి అంతకు రెండింతలు పెంచి 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు లక్ష్యాన్ని విధించారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. కూటమి ప్రభుత్వం హయాంలో తమకు సబ్సిడీని పెంచి, డ్రిప్ పరికరాలు సరఫరా చేస్తారన్న ఆశతో పెద్ద సంఖ్యలోనే రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 38027 మంది రైతులు 53923 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.



సూక్ష్మసేద్య పరికరాలకు ఇంకా సబ్సిడీ ధరలు ఖరారు చేయలేదు. గతంలో టీడీపీ హయాంలో ఉమ్మడి అనంత జిల్లాలో సూక్ష్మసేద్యం పరికరాలకు పదెకరాల దాకా 90 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా డ్రిప్ పరికరాలు సరఫరా చేశారు. గత వైసీపీ పాలనలో సూక్ష్మసేద్య పరికరాల మంజూరుకు సంబంధించి గైడ్ లైన్స్‌ను మార్చారు. ఐదెకరాల దాకా 90 శాతం, ఆపైన 70 శాతం సబ్సిడీని మాత్రమే వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలు సైతం ఇతర కేటగిరీల రైతుల

అప్పటి సబ్సిడీనే ఇప్పుడూ..

తరహాలోనే సబ్సిడీ పోను మిగతా డబ్బులు చెల్లించాలనే షరతు పెట్టారు. దీంతో అప్పట్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం ప్రభుత్వం సబ్సిడీ ఖరారు చేయకపోవడంతో ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైసీపీ సర్కార్‌లోని సబ్సిడీ పద్ధతిలోనే రైతులతో నాన్‌సబ్సిడీ సొమ్ము వసూలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 1798 మంది రైతులతో 2116 హెక్టార్లకు రైతులతో పాత విధానంతోనే నాన్ సబ్సిడీ డబ్బులు కట్టించుకున్నారు. వీరిలో 1028 మంది రైతులకు 1236 హెక్టార్లలో డ్రిప్ పరికరాల మంజూరుకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి దాకా 190 మంది రైతులకు 229 హెక్టార్లల్లో డ్రిప్ పరికరాలు సరఫరా చేశారు.

సబ్సిడీలు పెంచాలి: చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



డ్రిప్ మంజూరులో వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. సబ్సిడీ ధరలు కుదించడంతో రైతులపై అదనపు భారం పడింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీని ఎత్తేశారు. తద్వారా ఆయా వర్గాల రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఎక్కువ శాతం మంది రైతులు డ్రిప్ పరికరాలు అవసరం ఉన్నా.. సబ్సిడీలు తగ్గించడంతో డబ్బులు లేక కొనుగోలు చేయలేకపోయారు. కూటమి అధికారంలోకి వస్తే గత టీడీపీ హయాంలోని సబ్సిడీ ధరలు అమలు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామి మేరకు కొత్త గైడ్ లైన్స్ జారీ చేసి, రైతులకు సబ్సిడీలు పెంచాలి.

హామీని అమలు చేయాలి



గత టీడీపీ హయాంలో మాదిరిగానే డ్రిప్ సబ్సిడీ అమలు చేసి రైతులకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలి. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు డ్రిప్ పరికరాలు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా సబ్సిడీ ధరలు మార్చకపోవడం బాధాకరం. టార్గెట్ భారీగా ఇచ్చినా.. సబ్సిడీ ధరలు మార్చకపోతే ఎలాంటి ప్రయోజనం ఉండదు.

- వెంకట చౌదరి, పండ్లతోటల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

తండ్రి హత్యకేసులో తనయుడి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఈరన్న

యాడికి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఈ నెల 23వ తేదీన లక్ష్మీనారాయణను హత్య చేసిన కేసులో కార్తీక్ అనే యువకున్ని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో ఈ అరెస్టు వివరాలను వెల్లడించారు. ఇక్కడి వెంగమునాయుడుకాలనీలో నివాసం ఉండే లక్ష్మీనారాయణకు ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య వరలక్ష్మి, కుమారుడు కార్తీక్ ఉన్నారు. రెండో భార్య రమాదేవి ఒక కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం లక్ష్మీనారాయణ ఇద్దరి భార్యలకు దూరంగా నివాసం ఉంటున్నాడు. కాగా అతడికి మొదటి భార్య కుమారుడు కార్తీక్‌కు ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో కక్ష పెంచుకున్న కార్తీక్ ఈనెల 23న స్థానిక కుంటవీధిలో వెనుకవైపు ఉన్న దారిలో వెళుతున్న తన తండ్రిని రాళ్లతో దాడి చేసి దారుణంగా హత్యచేశాడు. మృతుడి రెండో భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ చెప్పారు. శుక్రవారం కార్తీక్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఎస్ఐ వెంకటేష్, సిబ్బంది రంగనాయకులు, హరినాథ్, రామాంజులరెడ్డి, శివ పాల్గొన్నారు.

హగరికి జలకళ




బెళుగుప్ప, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండ్లపల్లి సమీపంలో ఉన్న హగరి నదికి జలకళను సంతరించుకుంది. ఎగువ భాగాన ఉన్న భైరవాని తిప్ప ప్రాజెక్టు నుంచి గేట్లు ఎత్తడంతో నదిలో నీరు నిండుగా ప్రవహిస్తోంది. నది చుట్టుపక్కల గ్రామాల రైతులు తోటల్లో పంటల సాగుకు ఎలాంటి డోకా ఉండదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారం రోజుల కిందట క్వింటా పత్తి ఎనిమిదిన్నర వేలు ఉండగా ప్రస్తుతం ఆరున్నర వేలకు పడిపోయిందన్నారు. ప్రభుత్వం రూ.7250లు మద్దతు ధర ప్రకటించినా, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారుల మోసాలు పెరుగుతున్నాయన్నారు. పత్తి పంట గిట్టుబాటు కాకపోవడంతో ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం బాగా తగ్గిందన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంమీద ఒత్తిడి తెచ్చి సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

పీఆర్‌లో ముగ్గురికి డెప్యుటేషన్



అనంతపురం సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో పని చేస్తున్న ముగ్గురు ఉద్యోగులను డెప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ ఆశాఖ ఈఎన్‌సీ బాలు నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర సబ్ డివిజన్ పీఆర్‌ఐ డీఈఈగా పని చేస్తు న్న మల్లికార్జునను నంద్యాలకు బదిలీ చేశారు. ఈయన స్థానంలో అదే పరిధిలోనే మడకశిర పీఐయూ విభాగంలో జేఈగా పనిచేస్తున్న వెంకటేష్‌ను నియమించారు. తాడిపత్రి పీఐయూలో పనిచేస్తున్న జేఈ పద్మావతిని అనంతపురం క్యూసీ విభాగానికి బదిలీ చేశారు. దీంతో జేఈలు పద్మావతి, వెంకటేష్ శుక్రవారం ఆయా స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు.

గడువు పొడిగింపు

అనంతపురం టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎం కోర్సులో ప్రవేశానికి ఈనెల 30వరకు గడువు పొడిగించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ.దేవి శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. ఈమేరకు రాష్ట్ర వైద్యశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. కోర్సులో చేరడానికి వయసుతో నిమిత్తం లేదన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ కోరారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తా - రైతు మృతి



బోల్తాపడిన ట్రాక్టర్

ధర్మవరం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన రైతు దామోదర్ (35) ట్రాక్టర్ బోల్తా పడి మరణించాడు. శుక్రవారం దా మోదర్ తన మామిడితోటలో కలుపుతీయడానికి ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా.. అదుపు తప్పి ఆ వాహనం బోల్తాపడింది. ట్రాక్టర్ కింద పడి అతను అక్కడికక్కడే మరణించాడు. ధర్మవరం రూరల్ పోలీసు లు ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి త రలించారు. కేసు దర్యాప్తులో ఉంది. దామోదర్‌కు భార్య ఈశ్వరమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన దొంగల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాల వద్ద డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

నార్పల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేట్‌బ్యాంక్ ఏటీఎంలో పది రోజుల కిందట చోరీకి యత్నించిన దుండగులను నార్పల పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్‌తో కలిసి డీఎస్పీ వెంకటేశులు శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఒక మహిళ, నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఎస్ఐ సాగర్ తన సిబ్బందితో అక్కడికి వెళ్లగా, పోలీస్ జీపును చూసి వారు పారిపోవడానికి ప్రయత్నించారని తెలిపారు. పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకొని ప్రశ్నించారన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు వారు ఒప్పుకున్నట్లు వెల్లడించారు. ప్రధాన నిందితుడైన అనంతపురానికి చెందిన బోయ చిన్నబాబు, అతడికి తోడుగా అనంతపురం కక్కలపల్లికాలనీకి చెందిన సాకే చిన్న, గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన ఎరుకుల అంజలి, తాటిచెర్లకు చెందిన గొర్ల శంకర్, అనంతపురానికి చెందిన బోయ సాయిప్రేమను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. జల్సాలకు అలవాటు పడిన వీరు గ్రూప్‌గా ఏర్పడి గత కొంతకాలంగా అనంతపురం పరిసర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు వివరించారు. ఈక్రమంలోనే నార్పలలో ఈనెల 18న ఏటీఎం పగలగొట్టి చోరీకి యత్నించినట్లు తెలిపారు. అంతలోనే బీట్‌కు వచ్చిన కానిస్టేబుళ్లను చూసి పారిపోయినట్లు తెలిపారు. దుండగుల నుంచి ఒక ఆటో, ఐదు ద్విచక్రవాహనాలు, చోరీలకు ఉపయోగించే పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం



వృద్ధురాలిని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

కణేకల్లు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకోబోయిన ఓ వృద్ధురాలిని స్థానికులు కాపాడి పోలీసులకు అప్పగించారు. గుమ్మఘట్ట మండలం దొడఘట్టకు చెందిన వన్నూరమ్మ(75) శుక్రవారం మధ్యాహ్నం చెరువులోకి దూకి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు కాపాడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని వృద్ధురాలిని విచారించారు. తనకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు సంతానమని, కుమార్తెను కళేకుర్తికి చెందిన వన్నూరుస్వామికి ఇచ్చి వివాహం చేశానని, తాను కుమారులు మల్లికార్జున, భీమసేనల వద్ద ఉంటున్నానని తెలిపారు. తనకు ఆరోగ్యం సరిగా లేదని, ఎవరూ సరిగా చూసుకోకపోవడంతో ఆత్మహత్యకు యత్నించానని తెలిపారు. కుమార్తెకు ఆరోగ్యం బాగలేకపోతే చూడడానికి కళేకుర్తికి వెళ్లానని, తిరుగు ప్రయాణంలో చెరువులోకి దూ కేందుకు యత్నించానని చెప్పారు. పోలీసులు ఆమె కుమారులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తర్వాత ఆమెను వారికి అప్పగించారు.


టమోటా కిలో రూ.32

అనంతపురం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.32తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 1275 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు.


జీడిపల్లికి 1141 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం 1141 క్యూసెక్కుల కృష్ణాజలాల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,007 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

మూడు ముక్కలు... ఆరు పట్టీలు..!



గత నెల 18న ఆడిన పట్టీ



గత నెల 14న రాసిన మట్కా పట్టీ

- మండలంలో జోరుగా మట్కా, పేకాట
- ఓ వైసీపీ నాయకుడి ఆధ్వర్యంలో నిర్వహణ
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న పోలీసులు
- ఇద్దరు పోలీసుల రూటే సప'రేటు'



విడపనకల్లు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు విచ్చలవిడిగా మట్కా నిర్వహిస్తున్నా పోలీసులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నాయకుడు వైసీపీ ప్రభుత్వంలో పేకాటను ఎక్కువగా నిర్వహించేవాడు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మట్కాపైన కూడా దృష్టి సారించాడు. మండలంలోని గడేకల్లు, హావళిగి, డొనేకల్లు, పాల్తూరు, గాజుల మల్లాపురం, చీకలగురికి, ఉండబండ, పొలికి గ్రామాల్లో బహిరంగంగానే మట్కా పట్టీలు రాస్తున్నట్లు సమాచారం. రోజు మట్కా టర్నోవర్ రూ.లక్షల్లో ఉన్నట్లు తెలిసింది. ఒక్కొక్కరు రోజూ రూ. 1500 నుంచి 2వేలు వరకూ మట్కా రాయిస్తున్నారు. గ్రామాల్లో రాయించి మట్కా పట్టీలను మండల కేంద్రానికి చేరుస్తున్నారు. వాటిని ఆ వైసీపీ నాయకుడు కర్ణాటకకు చేరుస్తాడు. మరుసటి రోజు తగిలిన నంబర్లకు డబ్బులు చెల్లిస్తూ ఉంటాడు. ఈక్రమంలో కొన్ని సార్లు గొడవలు కూడా జరుగుతున్నట్లు సమాచారం. ఇలాంటిదే మూడు వారాల కిందట జరిగింది. విడపనకల్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి మట్కాలో రూ.లక్ష వచ్చింది. తగిలిన ఆ మొత్తాన్ని మట్కా రాయించుకున్న వ్యక్తికి ఇవ్వకుండా రూ. 20 వేలు మాత్రమే ఇచ్చారు. ఇదేమని ప్రశ్నిస్తే దాడికి పాల్పడినట్లు తెలిసింది. మండలంలో రోజూ లక్షల్లో పేకాట, మట్కా నిర్వహిస్తున్నా పోలీసులు నామ్‌కేవాస్తే తరహాలో దాడులు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కొత్త సీఐకి సవాల్?

ఉరవకొండ సీఐగా చిన్నగౌస్ ఈ నెల 10న బాధ్యతలు చేపట్టారు. గతంలో సీఐగా ఇక్కడ పని చేసిన అనుభవం ఉంది. అయితే అప్పటి పరిస్థితులకు ప్రస్తుత పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంది. దీంతో నియోజకవర్గంలో పేకాట, మట్కా నిర్మూలన సాధ్యమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మట్కా, పేకాట, వసూల్‌రాజాల విషయమై సీఐ చిన్న గౌస్‌ను వివరణ కోరగా వసూల్ రాజాల విషయమై పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. మట్కా, పేకాటను పూర్తిగా నిర్మూలిస్తామన్నారు.

ఇద్దరు వసూల్ రాజాలు

విడపనకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏ గ్రామం నుంచి చిన్న కేసు వచ్చినా ఇద్దరు పోలీసులు బేరాలు కుదుర్చుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మట్కా నిర్వాహకులతోను, పేకాటరాయుళ్లతోను, ఇసుక అక్రమ రవాణా చేసేవారితోనూ వీరిద్దరే మామూళ్ల వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. స్టేషన్ పరిధిలో ఏదైనా సరే వారి ఆధ్వర్యంలోనే జరగాలి. ఇంకొకరు స్టేషన్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే వారికి పగలే చుక్కలు చూపిస్తారు అనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడేకల్లులో ఒకే రోజు 5 చోరీలు జరిగితే ఏ ఒక్కటి బయటకు తెలియకుండా బాధితులను బెదిరించి కేసులు కూడా నమో దు చేయలేదు. రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు దొంగలను గడేకల్లు గ్రామంలో ఓ హోటల్ యజమానులు పట్టుకునే ప్రయత్నం చేయగా ఆ ఇద్దరు దొంగలు తప్పించుకుని పారిపోయారు. ఈ విషయాన్ని ఎక్కడైనా బయట తెలిపితే మీపైనే కేసులు నమోదు చేయిస్తామని బెదిరించిన ఘనులు వీరు. వ్యవసాయ మోటార్లు ఒకే రోజు 15 చోరీ అయితే స్టేషన్‌కు వెళ్లి రైతులు ఫిర్యాదు చేయలేని పరిస్థితి వీరిద్దరి మూలంగా ఏర్పడింది. ఫిర్యాదు చేయటానికి వెళితే ఎంత అడుగుతారో అనే భయం ప్రజల్లో బాగా ఏర్పడింది. మండలంలో అసాంఘీక కార్యక్రమాలు విచ్చలవిడిగా సాగుతున్నా విడపనకల్లు పోలీస్ సిబ్బందికి పట్టనట్లు ఉంటున్నారు.



ఒకే వ్యక్తి 1500 మట్కా ఆడిన పట్టీ

మల్టీపర్పస్ పీఏసీఎస్‌ల ఏర్పాటుకు జిల్లా కమిటీలు

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ ప్రైమరీ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సొసైటీలు, డెయిరీ, ఫిషరీస్ సొసైటీల ఏర్పాటు కోసం జిల్లా స్థాయిలో జాయింట్ వర్కింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర పథకం 'సహకార్ సే సమృద్ధి'లో భాగంగా జిల్లా సహకార అభివృద్ధి కమిటీలకు సబ్ కమిటీలుగా జిల్లా స్థాయి కమిటీలు పని చేయనున్నాయి. దీనికి జాయింట్ కలెక్టర్ స్థాయి కంటే తక్కువ కాని అధికారులను చైర్మన్లుగా నియమించాలని ప్రభుత్వం సూచించింది. సహకార సేవలు విస్తరించని గ్రామాలు, పంచాయతీలు, ప్రాంతాల్లో కొత్త మల్టీపర్పస్ ప్రైమరీ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటుకు సంబంధించిన కార్యకలాపాలను నిర్వహించడానికి ఈ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు కేంద్ర సహకార శాఖ మార్గదర్శకాలను జత చేసి, శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రాష్ట్రంలో తీరిన స్టాంపుల కొరత

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్టాంపు పేపర్ల కొరత తీరింది. శుక్రవారం రాష్ట్రానికి కొత్త స్టాంపు పేపర్లు వచ్చాయి. నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లు 20 లక్షలు, 100 రూపాయల స్టాంపు పేపర్లు 10 లక్షలు, 50 రూపాయల స్టాంపు పేపర్లు 10 లక్షలు వచ్చాయి.

భర్తను హత్య చేయించిన భార్య

- వివాహేతర బంధానికి అడ్డు వస్తున్నాడనే..
- ముగ్గురి అరెస్టు

పెనుకొండ టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వివాహేతర బంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను అతి కిరాతకంగా హత్య చేయించింది భార్య. ప్రియుడితో కలిసి కటకటాలపాలైంది. పరిగికి చెందిన పెయింటర్ రమేష్(40) హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో రమేష్ భార్య సరోజ, ఆమె ప్రియుడు చాకలి రాజు, మరొకరిని పెనుకొండ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక సీఐ కార్యాలయంలో అరెస్టు వివరాలను డీఎస్పీ మహేశ్ శుక్రవారం వెల్లడించారు. పరిగికి చెందిన రమేష్.. అదే మండలంలోని శ్రీరంగరాజులపల్లి వాసి సరోజను వివాహం చేసుకుని, పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగించేవాడన్నారు. మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. హిందూపురం మండలం తూమకుంట చెక్‌పోస్టులో గార్మెంట్స్ ఫ్యాక్టరీకి పనికి వెళ్తుండేది. ఈ క్రమంలో బంధువైన చాకలి రాజుతో పరిచయం ఏర్పడి, వివాహేతర బంధానికి దారితీసింది. భర్త అడ్డు తొలగించుకుంటే సంతోషంగా ఉండవచ్చని రమేష్ హత్యకు ప్రియుడితో కలిసి సరోజ పథకం రచించింది. చాకలి రాజు మేనమామ సుబ్బరాయప్ప సాయం తీసుకున్నారు. ఈనెల 19న రొద్దం మండలం ఎల్‌జీబీ నగర్ వద్దకు రమేష్‌ను సుబ్బరాయప్ప తీసుకొచ్చాడు. అక్కడే ఉన్న చాకలి రాజు కలిసి ముగ్గురు కల్లు తాగారు. సమీపంలోని వీధుల్లోకి వెళ్లి పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న కత్తితో రమేష్‌ను పొడిచి, గొంతు కోశారు. అనంతరం ద్విచక్రవాహనంలో తెచ్చుకున్న పెట్రోల్ పోసి, నిప్పంటించారు. ఈనెల 20 గుర్తుతెలియని రమేష్ శవాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికెళ్లి పరిశీలించిన పోలీసులకు.. అతడి వద్ద పెయింటింగ్‌కు సంబంధించిన కూపన్లు లభించాయి. వాటి ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. పరిగి మండలానికి చెందిన పెయింటర్‌గా గుర్తించారు. ఆ మేరకు అతడి భార్య సరోజ, ఆమె ప్రియుడు చాకలి రాజు, సుబ్బరాయప్పను అరెస్టు చేశారు. హత్యకు వాడిన కత్తి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రమేష్‌కు ఇద్దరు కుమారులున్నట్లు డీఎస్పీ వివరించారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేశ్

చేనుకు చేటు..!

పంటల్లో కలుపు నివారణ తలకు మించిన భారమవుతోంది. కూలీల కొరత వేధిస్తోంది. ఒకవేళ కూలీలు దొరికినా వారికి డబ్బు ఎక్కువగా ఇవ్వాల్సి వస్తుండడంతో రైతులు ఎక్కువగా కలుపును నివారించేందుకు గడ్డి మందుల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని పురుగమందు దుకాణదారులు నిషేధిత గడ్డి మందు గ్లైఫోసేట్‌ను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ గడ్డి మందు వాడడం ద్వారా నేల స్వభావం కోల్పోవడంతోపాటు అనేక దుష్పరిణామాలు తలెత్తుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనిపై పూర్తిగా అవగాహనలేని రైతులు విచ్చలవిడిగా వాడుతున్నారు.

- నిషేధిత కలుపు మందుతో దుష్పరిణామాలు
- నిస్సారమవుతున్న భూములు
- ప్రజల్లో సైతం ఆరోగ్య సమస్యలు
- అయినా.. యథేచ్ఛగా విక్రయాలు
- రైతుల్లో కొరవడిన అవగాహన



మార్కెట్‌లో లభిస్తున్న గ్లైఫోసేట్ మందు

కదిరి అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా రసాయన, పురుగు మందుల దుకాణాలు ప్రమాదకర, నిషేధిత గడ్డిమందు విచ్చలవిడిగా విక్రయిస్తున్నాయి. ఈ గడ్డిమందు వాడితే నేల స్వభావం కోల్పోవడం, ప్రజల ఆరోగ్యంపై దుష్పరిణామాలు చూపుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. కాసులకు కక్కుర్తిపడి పురుగుమందుల దుకాణల్లో నిషేధిత గడ్డిమందులు విక్రయిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్లైఫోసేట్ మందును నిషేదించారు. తేయాకు తోటలు సాగుచేసే రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ గడ్డి మందును నిషేధించలేదు. దీంతో జిల్లాకు పక్కనే ఉన్న కర్ణాటక నుంచి అక్రమంగా గడ్డిమందు దిగుమతి అవుతున్నట్లు తెలుస్తోంది.

క్యాన్సర్ కారకాలు

పంటల మధ్యలో పెరిగిన గడ్డి, ఇతర ఆకుల్లాంటి కలుపు నివారణకు అనుమతి పొందిన మందులు పిచికారీ చేయాలి. ఆ తర్వాత కలుపు ఎండిపోవడానికి ఐదారు రోజులుపైగా పడుతుంది. నిషేధిత గ్లైఫోసేట్‌ను వాడితే గంటల వ్యవధిలో ఎండిపోతోంది. దీని దుష్పరిణామాలపై అవగాహన లేకపోవడంతో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వస్తాయని కలుపు మందును వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మందును అధికంగా వినియోగంచడంతో క్యాన్సర్‌తోపాటు చర్మ సంబంధిత వ్యాధుల బారినపడే అవకాశం అధికంగా ఉందని పరిశోధనల్లో వెల్లడైంది.

నష్టాలివీ..

పొలంలో కలుపు నివారణ మందు పిచికారీ చేస్తే సాధారణంగా వారంరోజుల్లో ఆ మందు శక్తిని కోల్పోతుంది. నిషేధిత గ్లైఫోసేట్ 30 నుంచి 45 రోజులపైగా భూమిలో అలాగే ఉంటుంది. దీంతో భూమి నిస్సారమవుతోంది. అది పంట దిగుబడిపై ప్రభావం చూపుతోంది. భూమి సారాన్ని పెంచేందుకు ఎరువుల రూపంలో అదనపు ఖర్చు భరించాల్సి వస్తోంది. భూమిలో పంటకు మేలుచేసే జీవరాశులు, సూక్ష్మజీవులు, పోషకాలుంటాయి. ఎక్కువకాలం భూమి పొరల్లో కలుపుమందు అవశేషాలుండడంతో పైరుకు మేలు చేసేవన్నీ నశించిపోతాయి. వాతావరణం కలుషితమై, ఆగాలి పీల్చిన రైతులు, ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది.



నిషేధిత కలుపుమందు వాడవద్దు



రాష్ట్రంలో గ్లైఫోసేట్ కలుపు నివారణ మందును ప్రభుత్వం నిషేధించింది. విక్రయించడం చట్టరీత్యా నేరం. నిషేధిత మందు పిచికారీ చేస్తే పంట, ప్రజలు, భూమిపై చెడు ఫలితాలుంటాయి. ఇది పరిశోధనల్లో వెల్లడైన నిజం. అనుమంతి పొందిన కలుపు నివారణ మందులు మాత్రమే ఉపయోగించాలి. గ్లైఫోసేట్‌ను విక్రయించినా, పిచికారీ చేసినా కఠిన చర్యలు తప్పవు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

పోలీసు ఆయుధాలపై అవగాహన అవసరం: ఎస్పీ



ఆయుధాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు విధుల్లో వినియోగించే ఆయుధాల పట్ల విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండటం మంచిదని ఎస్పీ జగదీష్ అభిప్రాయపడ్డారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని షాదీఖానాలో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ప్రదర్శనలో ఉంచారు. సుశిక్షితులైన సిబ్బందిచే సందర్శనకు విచ్చేసిన ప్రజలు, విద్యార్థులకు ఆయుధాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, త్రీటౌన్ సీఐ శాంతిలాల్, ఆర్ఐలు రెడ్డప్పరెడ్డి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలివే: 22 రైఫిల్, 410 మస్కట్, 303 రైఫిల్, 762 ఎం.ఎం ఎస్ఎల్ఆర్, ఏకే 47, 5.56 ఎం.ఎం(ఇన్సాస్), 9 ఎంఎం, కార్బన్, 38 రివాల్వర్, 9ఎంఎం పిస్టోల్, 9ఎంఎం గ్లాక్, వివిల్ పిస్టోల్, ప్రొజెక్టర్ పైరో టెక్, 12బోర్ పంప్ యాక్షన్‌గన్, ఎల్ఎంజి 51 ఎం.ఎం మోటారు, హెచ్ఇ 36 గ్రెనేడ్, యాంటీ రైట్‌గన్స్, గ్యాస్‌గన్, రోబోటిక్(బాడీ ప్రొటెక్టర్), సేవాదళ్ డ్రస్, ఫైబర్ లాఠీ, బాడీ ప్రొటెక్టర్, స్టోన్ గార్డు, హెల్మెట్ , కేన్ లాఠీ, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ హెవీ, మీడియం లైట్ డే, నైట్ విజన్ బైనాక్యులర్లు, జీపీఎస్, మెగాఫోన్, లెటర్ బాంబు డిటెక్టర్, డిఎస్ఎండి, హెచ్‌హెచ్ఎండీ, ఎన్ఎల్‌జేడీ, నార్కో డిటెకన్ కిట్, పాలిరే యువి లైట్, క్లూస్‌టీం, డస్ట్ ఫుట్ ప్రింట్ లిఫ్టర్, ఎల్‌హెచ్ఎంఎస్, బాడీవోస్ కెమెరాలు, ఫిన్స్(ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్ వర్కింగ్ సిస్టం), డ్రోన్ కెమెరాలు, డీఎఫ్ఎడీ బాంబు రింగ్, వాటర్ కేనన్, వజ్ర వాహనాలు, డాగ్ బృందాలను ప్రదర్శనలో ఉంచారు.



విద్యార్థినితో పోలీసు జాగిలం కరచాలనం

ప్రమాదాలను నివారిద్దాం

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



రోడ్డు ప్రమాదాల సమీక్షలో కలెక్టర్, ఎస్పీ

అనంతపురం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించి.. జీవితాలను కాపాడుదామని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులతో అన్నారు. కలెక్టరేట్‌లో రోడ్డు ప్రమాదాల నివారణపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో రోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల కారణంగా కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని అన్నారు. రోడ్డు భద్రతపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లలో లైటింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. క్రమం తప్పకుండా హెల్మెట్లు ధరించేవారిని గుర్తించి.. నగదు బహుమతి అందించి అభినందించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో సీసీ కెమెరాల ఇన్‌స్టలేషన్‌కు చర్యలు తీసుకోవాలని నగరపాలిక అధికారులను ఆదేశించారు.

బ్లాక్ స్పాట్‌లలో మళ్లీ ప్రమాదాలు: ఎస్పీ

ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి.. నివారణ చర్యలు తీసుకుంటున్నామని, అయినా అదే ప్రాంతాల్లో మళ్లీ ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్పీ జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్ స్పాట్‌లపై ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పట్టణ ప్రాంతాలలో ఆర్టీసీ బస్సులను అతివేగంగా నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ పరంగా తీసుకుంటున్న చర్యలను ఆర్ఎం సుమంత్ వివరించారు. సమావేశంలో డీటీసీ వీర్రాజు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, నేషనల్ హైవే అధికారులు, ట్రాఫిక్ సీఐలు పాల్గొన్నారు.

ఇళ్లు ఒకరివి.. పట్టా మరొకరికి..!

- రెవెన్యూ అధికారుల నిర్వాకం..
- మూడేళ్లుగా పోరాడుతున్న బాధితులు

శింగనమల అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శివపురం సమీపంలో పేదలు ఇళ్లు నిర్మించుకున్న స్థలానికి గ్రామ నౌకరు భార్య పేరిట ఓ రెవెన్యూ అధికారి డి-పట్టా ఇచ్చారు. సమస్యను పరిష్కరించాలని బాధితులు మూడేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామనౌకరు భార్య పేరును వైబ్‌ల్యాండ్, ఆన్‌లైన్‌లో తొలగిచలేదు. దీంతో బాధితులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. చక్రాయపేట సర్వే నంబర్ 531లో 2.17 ఎకరాల భూమి తలారి తిరుపాలు పేరిట ఉండేది. దీన్ని శివపురం దళితులు, బీసీలు 17 మంది ఇంటి స్థలాల కోసం కొనుగోలు చేశారు. అగ్రిమెంట్ చేసుకుని ఇళ్లను నిర్మించుకున్నారు. ఐదేళ్ల క్రితం గ్రామనౌకరు భార్య ఎం.లక్ష్మి పేరిట అప్పటి రెవెన్యూ అధికారి 2.17 ఎకరాలకు డి-పట్టా ఇచ్చారు. ఆ భూమి పేరిట ఆమె బ్యాంకులో రుణం తీసుకున్నారు. హైవే కోసం సర్వే నిర్వహించే సమయంలో డి-పట్టా విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి బాధితులు న్యాయం కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని నారాయణస్వామి, సన్నాగప్ప, చంద్ర, చిన్న ఎర్రప్ప, శివయ్య కోరారు. అగ్రిమెంట్ చేసుకున్నవారు సరైన ఆధారాలు చూపిస్తే గ్రామ నౌకరు భార్య పేరును ఆన్‌లైన్ నుంచి తొలగిస్తామని తహసీల్దారు బ్రహ్మయ్య అన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న శివపురం దళితులు

రివర్స్ సుందరీకరణ .. !



డివైడర్ మధ్య పూలమొక్కల అందాలు (ఫైల్)

ఐదేళ్లుగా రివర్స్ పాలనకు అధికారులు సైతం బాగా అలవాటు పడినట్లు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం పోయి దాదాపు నాలుగు నెలలు అవుతున్నా .. ఇంకా అధికారులు అదే భ్రమలో ఉన్నారు కాబోలు. అందుకు పుట్టపర్తి మునిసిపాలిటీ అధికారుల చర్యలే నిదర్శనం. సత్యసాయి బాబా జయంతి వేడుకలు సమీపిస్తున్న తరుణంలో పట్టణాన్ని మరింత సుందరీకరణ చేయాల్సిన వీరు... అందంగా ఉన్న మొక్కలను తొలగించి.. రివర్స్ సుందరీకరణ చేశారు. రోడ్లను కళాహీనంగా మార్చేశారు.

నివ్వెరపరిచిన మునిసిపల్ అధికారుల చర్యలు

పుట్టపర్తిరూరల్,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నుంచి మామిళ్లకుంట కూడలి వరకు రోడ్డు మధ్యలోని డివైడర్లలో పెరిగిన బోగన్‌విల్లా తదితర మొక్కలు.. అందమైన పూలతో ప్రయాణికులను ఆహ్లా ద పరిచేవి. ఇటీవల కురిసిన వర్షాలు అవి మరించ పచ్చగా మారి.. మధురానుభూతి కలిగించేవి. సత్యసాయిబాబా జయంతి వేడుకలు సమీపిస్తున్న తరుణంలో దేశ విదేశాల నుంచి లక్షలాదిమంది విదేశీ, స్వదేశీ భక్తులు భారీగా పుట్టపర్తికి వస్తారు. ఈ నేపథ్యంలో మునిసిపాలిటీ అధికారులు నగర సుందరీకరణపై దృష్టి సారించారు. అయితే మరిన్ని పూల మొక్కలు నాటి.. నగ రానికి మరింత అందం తెచ్చేలా చేయాల్సిన వీరు.. డివైడర్ మధ్య అందంగా.. పచ్చగా ఉన్న బోగన్‌విల్లా తదితర మొక్కలు పూర్తి గా తొలగించారు. దీంతో నేడు ఆ రోడ్డు మొత్తం కళాహీనంగా.. బోసిపోయి.. కనిపి స్తోంది. అందంగా ఉంచాల్సిన రోడ్డును ఇలా అందవిహీనంగా మార్చడంపై ప్రకృతి ప్రేమికులు, స్థానికులు మండిపడుతు న్నారు. సుందరీకరణ అంటే ఇదా అని నివ్వెరపోతున్నారు.



మొక్కలు తొలగించడంతో కళాహీనంగా మారిన డివైడర్

క్లుప్తంగా...

నేడు స్పాట్ అడ్మిషన్లు

ధర్మవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రథమ సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీలలో స్పాట్ అడ్మిషన్ పొందడానికి శనివారం అవకాశం కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్పాట్ అడ్మిషన్లలో చేరిన వారికి ప్రభుత్వం నుంచి లభించే ఎలాంటి స్కాలర్‌షిప్‌లు వర్తించబోవన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన

ధర్మవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు తీసుకోవడం కలిగే అనర్థాలపై స్థానిక సాయికృప జూనియర్ కళాశా లలో విద్యార్థులకు శుక్రవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ పురుషోత్తంరెడ్డి అవగాహన కల్పించారు. ఇందులో నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధి బిసాతి గరుగు బాలాజీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, సామాజిక కార్యకర్త ముక్తం మణిదీప్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌ఐగా క్రిష్ణవేణి



తాడిమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తాడిమర్రి నూతన ఎస్‌ఐగా క్రిష్ణవేణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్‌ఐ నాగాస్వామి వీఆర్‌కు బదిలీపై వెళ్లగా.. ఆ స్థానంలో గాండ్లపెంట ఎస్‌ఐ క్రిష్ణవేణి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సీపీఎం కమిటీ ఎంపిక

తనకల్లు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శుక్రవారం నిర్వహించిన సీపీఎం మండల స్థాయి సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. మండల కార్యదర్శిగా బత్తినవారిపల్లికి చెందిన శివన్నను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఇందులో రైతుసంఘం జిల్లా నాయకుడు సుబ్బిరెడ్డి, నాయకులు వీవీ రమణ, ఎస్‌వీ రమణ, ఒట్టెందు వేమన్న, శ్రీనివాసులు, చలపతి, నాగేంద్రనాయుడు, శ్రీరాములు, వెంకటేష్ పాల్గొన్నారు.

రీసర్వే సమస్యలపై గ్రామసభ

తనకల్లు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరాయునిపల్లిలో భూముల రీసర్వే సమస్యలపై గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ఇందులో ఏడు ఫిర్యాదులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పశుగణన పారంభం

బత్తలపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో పశుగణన కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించామని, దీన్ని ఫిబ్రవరి 22 వరకు నిర్వహిస్తామని పశువైద్యాధికారి గురునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని 11 పంచాయతీల్లోని పాడి రైతులు, గొర్రెల కాపర్ల వద్ద ఉన్న పశువుల వివరాలను సేకరించి.. వారి ఆధార్‌కు అనుసంధానం చేస్తామన్నారు. అందుకు సంబంధించి పోస్టర్‌ను ఆయన సిబ్బంది సురేష్, శ్రీనివాసులు, మురళి, పోతలయ్య, హనుమంత్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

ధర్మవరం: పశుగణన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సంచాలకుడు చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ ఏడీ వీరభద్రయ్య, పశువైద్యాధికారి శేఖర్ పాల్గొన్నారు.

దుకాణాలపై అధికారుల దాడులు

ధర్మవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాలపై మున్సిపల్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శుక్రవారం దాడులు నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్, కళాజ్యోతి, అంజుమన్‌సర్కిల్, కొత్తపేట సర్కిల్‌లో దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి.. 136 కేజీల నిషేధిక ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. రూ.21,500 జరిమానా విధించారు.

వెలగని వీధిదీపాలు



చాకలివీధిలో వెలగని వీధిదీపం

నంబులపూలకుంట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్, సోలార్ వీధిదీపాలు వెలగడం లేదు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వీధులన్నీ చిత్తడిగా.. బురదగా మారాయి. దీనికి తోడు వీధిదీపాలు వెలగక పోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. వర్షాలకు పచ్చిక ఏపుగా పెరగడంతో విషపురుగులు అధికంగా సంచరిస్తూ.. ఇళ్లలోకి వస్తు న్నాయి. అధికారులు స్పందించి వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తెరుచుకోని మద్యం షాపు



తాడిమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం శుక్రవారం కూడా తెరుచుకోలేదు. గురువారం సాయంత్రం దుకాణాన్ని ప్రారంభించేందుకు అసలు యజమాని కాకుండా.. అతనితో అగ్రిమెంట్ చేసుకున్న వ్యక్తి వచ్చాడు. దీంతో అసలు యజమాని వచ్చేంతవరకు దుకాణాన్ని తెరవకూడదని పలువురు వాగ్వాదానికి దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి శుక్రవారం ఉదయం లోపు సమస్యను పరిష్కరించుకోవాలని ఆ అగ్రిమెంట్‌దారుడిని వెనక్కు పంపారు. కాగా శుక్రవారం సాయంత్రం వరకు అగ్రిమెంట్‌దారుడు ఆ షాపు తెరిచేందుకు ముందుకు రాలేదు. షాపు వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వానొస్తే నరకమే..!

అండర్ బ్రిడ్జి కింద నిల్వ ఉంటున్న వర్షపు నీరు

ధర్మవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వాన వచ్చినా... స్థానిక గాంధీనగర్ అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వ ఉంటోంది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపేట, రాంనగర్, బాలాజీనగర్, గుట్టకిందపల్లితో పాటు చిగిచెర్ల, బడన్నపల్లి, ఉప్పునేశనపల్లి, వసంతపురం గ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జి కింది నుంచి వెళ్లాల్సిందే. అదే విధంగా రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణీకులు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ఇలా రావాల్సిందే. మంత్రి సత్యకుమార్ యాదవ్ రైల్వే అధికారులతో చర్చించి.. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అండర్ బ్రిడ్జి కింది నిల్వ ఉన్న వర్షపు నీరు

కాలువలో ముళ్లపొదల తొలగింపు

10 కిలోమీటర్ల మేర నీటి మార్గం సుగమం

ధర్మవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ధర్మవరం చెరువు నుంచి రావులచెరువు వరకు ఉన్న కెనాల్‌లో జంగిల్ క్లియరెన్స్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ధర్మవరం చెరువు కింద ఉన్న కెనాల్ కంపచెట్లు, మట్టితో పూడుకుపోయింది. దీంతో కెనాల్ నుంచి పలు గ్రామాలకు సాగునీరు అందక ఆయా గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయకట్టు రైతులు ఇరిగేషన్ అధికారులు, పాలకులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ప్రస్తుతం మంత్రి సత్యకుమార్‌యాదవ్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి రైతులు ఈ సమస్యను తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు ఎక్స్‌కవేటర్ సాయంతో కెనాల్‌లో 10 కిలోమీటర్ల వరకు ముళ్లకంపలను, పూడికను తొలగించారు. పోతుకుంట చెరువులో కూడా ముళ్లకంపలను తొలగించారు. దీంతో ఆయాగ్రామాల రైతులు.. పరిటాల శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



కాలువలో ముళ్లపొదలను తొలగిస్తున్న దృశ్యం

క్రైం కార్నర్

నదిలో పడి వృద్ధురాలి మృతి

కొత్తచెరువు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరగంపల్లి గ్రామానికి చెందిన అంకే వీరమ్మ (64) శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు కాలు జారీ వంగపేరు నదిలో పడి మరణించింది. అంకేవీరమ్మ బట్టలు ఉతకడానికి గ్రామ సమీపంలోని వంగ పేరునది వద్దకు వెళ్లింది. బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నదిలోకి పడి ప్రవాహానికి కొట్టుకుపోయింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గాలించగా... నదిలోని ఓ చెట్టుకు ఆమె మృతదేహం తగులుకొని ఉండటాన్ని గమనించి.. వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అంకే వీరమ్మకు భర్త ఆంజనేయులు, నలుగు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుళ్లకు గాయాలు

ధర్మవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఉపేంద్ర, నాగేంద్ర గొల్లపల్లి వద్ద ఓ కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరు అనంతపురం నుంచి ద్విచక్రవాహనంలో చిగిచెర్ల మీదుగా ధర్మవరం వస్తుండగా... గొల్లపల్లి వద్ద ధర్మవరం నుంచి వస్తున్న ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ ఉపేంద్రకు తీవ్రంగా, నాగేంద్రకు స్వల్పంగా గాయాలయ్యాయి. వీరిని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఉపేంద్రను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల కాపరికి..

తాడిమర్రి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకొండయ్యపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పూలకుంట చిన్నప్ప తీవ్రంగా గాయపడ్డారు. గొర్రెల మంద వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా గ్యాస్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ చిన్నప్పను గ్యాస్ వాహన డ్రైవర్ బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఫ్లెక్సీ చింపివేత.. ఫిర్యాదు

గాండ్లపెంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాలుగురోడ్ల కూడలిలో టీడీపీ వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చింపేశారు. దీనిపై కూటమి నాయకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి ఎస్ వలీబాషా చినిగిన ఫ్లెక్సీని పరిశీలించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, సర్పంచ్ శివప్పనాయుడు, ఉప సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, రాము, అక్రమ్‌బాషా, ఆనంద్, సనావుల్లా, బావాసాబ్, క్రిష్ణానాయక్ పాల్గొన్నారు.





ఎస్‌ఐ వలీబాషాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు, చిరిగిన ఫ్లెక్సీ (ఇన్‌సెట్లో)

పీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ



వైద్యులతో డీఎంహెచ్‌ఓ మంజువాణి

పుట్టపర్తిరూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో జిల్లాలోని 42 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులకు విధుల నిర్వహణపై రెండురోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. రోగుల వైద్య సేవలకు సంబంధించిన వివిధ యాప్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పీఎస్ మంజువాణి మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడంలో.. విధి నిర్వహణలో అలసత్వం వీడాలని వైద్యులకు సూచించారు. వైద్య సేవల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియాసాల్మన్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేంద్రనాయక్, డీపీఎం కేసీకే నాయక్, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్ర నాయక్, జిల్లా ఆర్‌బీఎస్కే ప్రోగ్రాం డైరెక్టర్ నివేదిత పాల్గొన్నారు.

రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సబ్‌డివిజన్ పరిధిలో పలుప్రాంతాల్లో డీఎస్పీ విజయ్‌కుమార్ శుక్రవారం రాత్రి గస్తీ, నైట్ బీట్ చెకింగ్, పెట్రోలింగ్‌లను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలో చోరీల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ప్రతిరోజు రాత్రివేళల్లో పోలీసులతో ముమ్మరంగా గస్తీలు, పెట్రోలింగ్, నైట్‌బీట్ చెకింగ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదుచేస్తామన్నారు. గ్రామాల్లో కొత్తవ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

విజేతలకు బహుమతుల అందజేత

కదిరి అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు గురువారం నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి శుక్రవారం బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో యశ్వంత్, మోబీనా, దుర్గాప్రసాద్, వకృత్వ పోటీల్లో సాఫియా, శేషాద్రి, జాన్సీ విజేతలుగా నిలిచారు. వీరికి వరుసగా మొదటి బహుమతిగా రూ. మూడు వేలు, రెండో బహుమతిగా రూ. రెండు వేలు, మూడో బహుమతిగా రూ. వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నారాయణరెడ్డి, ఎస్‌ఐ బాబ్‌జాన్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ శివప్రసాద్, అధ్యాపకులు హైదర్‌వలీ, శంకర్, ఆదినారాయణ, సుందరమోహన్‌రెడ్డి, పీడీ నరసింహాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి ఆమోదం

ధర్మవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక పాండురంగస్వామి ఆలయ పునర్నిర్మాణానికి టెండర్‌ను ఆమోదిస్తూ దేవాదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శుక్రవారం ఉత్తరులు జారీ చేశారు. అనంతపురానికి చెందిన కాంట్రాక్టర్ ప్రభాకర్‌రెడ్డి రూ.1.05 కోటికి వేసిన టెండర్‌కు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. పట్టణంలో ప్రసిద్ధిగాంచిన ఈ పాండురంగస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. దాన్ని పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దేవాదాయశాఖ లేఖ రాశారు. స్పందించిన అధికారులు టెండర్లను ఆహ్వానించారు. ప్రభాకర్‌రెడ్డి టెండర్‌కు అధికారులు ఆమోదం తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి చొరవ చూపినందుకు పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు భానుతేజ



కదిరి అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు పట్టణంలోని వాల్మీకి పాఠశాలలో పదో తరగతి విద్యార్థి భానుతేజ ఎంపికయ్యాడు. ఈనెల 21 నుంచి 23 వరకు అండర్ 17 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హిందూపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో భానుతేజ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నవంబరు 6వ తేదీ నుంచి ఉత్తర్ ప్రదేశ్‌లో నిర్వహించే జాతీయస్థాయ క్రీడాపోటీల్లో పాల్గొంటారు. అతన్ని ఆ పాఠశాల కరస్పాండెంట్ అనిల్‌కుమార్‌రెడ్డి, పాఠశాల యజమాన్యం, ఉపాధ్యాయులు, పీఈటీ శుక్రవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలబాలికలు

ధర్మవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరానికి చెందిన కిరణ్మయి, నిఖ్యశ్రీ, యశస్విని, లక్ష్మీనరసింహ, కార్తీక్‌నాయక్ ఎంపికయ్యారు. ఈనెల 21న అనంతపురం ఇండోర్‌స్టేడియంలో జరిగిన అండర్-17 విభాగంలో జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచి.. రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా మార్టూరులో జరిగే 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొంటారు. వీరిని ధర్మాంబ బాస్కెట్‌బాల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి హిదయ్‌తులాల, కోచ్ సంజయ్, పీడీ నాగేంద్ర శుక్రవారం అభినందించారు.

29న హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

కదిరి అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హ్యాండ్ బాల్ సీనియర్ మహిళ జిల్లా జట్టును ఈనెల 29న ఎంపిక చేస్తున్నట్లు హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ శుక్రవారం ఓ ప్రకటలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో 29న ఉదయం 10 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ మైదానానికి రావాలని, వివరాలకు 8317673593 నంబర్లలో సంప్రదించాలని అన్నారు.

పశుగణనకు సహకరించండి

హిందూపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హిందూపురం పశుసంవర్ధకశాఖ పరిధిలోని ప్రజలు పశు, జంతు గణనకు సహకరించాలని ఆశాఖ డీడీ డా.పెంచలయ్య కోరారు. శుక్రవారం పశుగణనకు సంబంధించి పోస్టర్లను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసంలో మునిసిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాస్ టీడీపీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు ప్రతి నివాసగృహాన్ని సందర్శించి గేదెలు, ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, గాడిదలు, కంచరగాడిదలు, ఒంటెలు, ఏనుగులు, కుక్కలు, కుందేళ్ల పిల్లలు, మొదలగు జంతువులతోపాటు కోళ్లు, బాతులు, టర్కీ కోళ్లు వివరాలు సేకరిస్తారన్నారు. దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. డివిజన్ పరిధిలో 110మంది ఎన్యుమరేటర్లు, 18మంది సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చి ఇళ్లకు పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బహువిధ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ గిరిజ, అసిస్టెంట్ డైరెక్టర్ తిప్పేస్వామి, డా.రాధిక, టీడీపీ కౌన్సిలర్లు రమేష్, నాయకులు నెట్టప్ప, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి బాలయ్య నిధులు


భూమిపూజ చేస్తున్న కన్వీనర్ జయప్ప

లేపాక్షి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మైదుగోళం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రూ.30వేలు అందజేశారని టీడీపీ మండల కన్వీనర్ జయప్ప అన్నారు. గ్రామ పాఠశాలలో భవనం శిథిలావస్థకు చేరుకుందని ప్రహరీ గోడ లేదని గ్రామస్థులు, టీడీపీ నాయకులు జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్ బాలయ్య దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బాలయ్య, తన సొంత నిధులు రూ.30వేలను నాయకులకు అందజేశారు. శుక్రవారం పాఠశాలకు చేరుకుని అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నారాయణ మృతి బీఎస్పీకి తీరనిలోటు

హిందూపురం అర్బన్, అక్టోబరు 25:(ఆంధ్రజ్యోతి): ఉన్నత విలువలు గల నాయకుడిని సమాజ్‌వాదీ పార్టీ కోల్పోయిందని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు పేర్కొన్నారు. ఎంఎల్ నారాయణ 30 సంవత్సరాలు బీఎస్పీకి సేవలందించారన్నారు. పేద, బడుగు, బలహీన ప్రజల కోసం ఎంతగానో పాటుపడ్డారని ఆయన మృతి తీరని లోటన్నారు. కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కోశాధికారి హరికుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి రామాంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడు నాజీమ్ బాషా, నాయకులు ఈశ్వరయ్య, రిటైర్డ్ ఎంఈఓ పెన్నయ్య, ఇండీవర్, గంగాధరప్ప పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చెక్కు పంపిణీ

హిందూపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పాల వాహనం నడుపుతూ ప్రమాదంలో మృతిచెందిన డ్రైవర్ కుటుంబానికి హెరిటేజ్ డెయిరీ తరుపున రూ.15లక్షల చెక్కును అందజేశారు. లేపాక్షి మండలం చోళసముద్రంకు చెందిన వెంకటేశ్ కొంతకాలంగా హెరిటేజ్ డెయిరీకి సంబంధించిన పాల వాహనాన్ని నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం పరిగి మండలంలోని జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో హెరిటేజ్ సంస్థవారు ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. మృతుని భార్య పవిత్రకు శుక్రవారం రూ.15లక్షల చెక్కును హెరిటేజ్ జనరల్ మేనేజర్ సర్వోత్తంరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్లాంట్ మేనేజర్ బాబు, ఏరియా మేనేజర్ ఆదినారాయణ,పాడిరైతులు, హెరిటేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు అనూహ్య స్పందన


ఇంటర్వ్యూకి హాజరైన అభ్యర్థులు

మడకశిరటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఎంప్లాయ్‌మెంట్, సీడాప్ సంయుక్తంగా శుక్రవారం మడకశిర ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమానికి 223 మంది హాజరయ్యారు. జాబ్‌మేళాకు 8 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో 108 మందిని వివిధ కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేసుకొన్నారు. నిరుద్యోగ యువతకు ఈజాబ్‌మేళా కార్యక్రమం ఎంతో ఉపయోగకరం అని ఇంటర్వ్యూకు హాజరైన యువకులు పేర్కొన్నారు. ఈసందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హేమలత, వైస్ ప్రిన్సిపల్ నాగరాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, వి.చంద్రశేఖర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ తేజ్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

పాముకాటుకు మహిళ మృతి

గుడిబండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గుడిబండ మండలం పి.సి.గిరి గ్రామానికి చెందిన నీలమ్మ(55)పాముకాటుతో మృతిచెందింది. ఆమె శుక్రవారం తోటి కూలీలతో కలిసి పనులకు వెళ్లింది. అగళి మండలం హళ్లికెరె గ్రామానికి చెందిన ముద్దరాజు అనే రైతు పత్తిచేలో పత్తిని విడిపించేందుకు వెళ్లింది. పత్తితోటలో పత్తి విడిపిస్తున్న సమయంలో సాయంత్రం 4 గంటల సమయంలో పాముకాటు వేసింది. వెంటనే చుట్టుపక్కల కూలీలకు నీలమ్మ విషయం తెలిపింది. వెంటనే ఆమెను రొళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పీహెచ్‌సీ వైద్యులు సృజన తెలిపారు. నీలమ్మ మృతి చెందడంతో వీధిన పడ్డామని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం మృతి చెందిన నీలమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సబ్సిడీపై రాగి విత్తనాల పంపిణీ

రొళ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రాగి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ రాజ్యలక్ష్మీ తెలిపారు. నాలుగు కిలోలకు గాను రూ.140 చెల్లించి ఆయా కేంద్రాలలో విత్తనాలు పొందాలని తెలిపారు. కరెంటు బిల్లు, ఆధార్‌కార్డు తీసుకొచ్చి తీసుకెళ్లాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల రైతులను కోరారు.

చేతికందినా నోటికందలేదు


వర్షాలకు వాలిపోయిన వరి పంట


మొలకలొచ్చిన వేరుశనగ కాయలు

● వర్షాలకు దెబ్బతిన్న పంటలు ● ఆదుకోవాలంటున్న మండల రైతులు

మడకశిర రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో చేతిదాకా వచ్చినా నోటిదాకారాలేదని రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో కేతేపల్లి గ్రామానికి చెందిన మల్లేగౌడ్ మిరప పంట పూర్తిగా నీటమునిగింది. పాపసానిపల్లి గ్రామానికి చెందిన రైతు రమేష్ వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతింది. వారం రోజులు వర్షం రావడంతో తొలగించిన వేరు శనగ కాయలు మొలకలు వచ్చాయి. పంట నల్లగా మారింది. బూజుకూడా పట్టడంతో ఆ పంట ఎందుకూ పనికిరాకుండా పోయింది. పంట కళ్లఎదుటే నష్టపోతుంటే రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

కల్లుమర్రి గ్రామానికి చెందిన శ్రీధర్ రెడ్డి కోత దశలో ఉన్న వరి పంట వర్షం వల్ల చేలోనే ఒరిగిపోయింది. కంకులన్నీ నేలపాలయ్యాయని రైతు ఆవేదనవ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మండల వ్యసాయఅధికారి తిమ్మప్ప రైతు పంట పొలాలను పరిశీలించారు. అనంతరం దెబ్బతి న్న పంటల వివరాలను నమోదుచేసుకున్నారు. త్వరలో వివరాలను పై అధికారులకు పంపుతామన్నారు. వర్షాల వల్ల నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పురంలో నిత్యం ట్రాఫిక్ జామ్


గాంధీ సర్కిల్‌లో వాహనాల రద్దీ

హిందూపురం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నిత్యం ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో పాఠశాలలు, కళాశాలలు వదిలినప్పుడు, ప్రధాన సర్కిళ్లలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ముఖ్యంగా ఈ సమయంలో ప్రధాన సర్కిల్‌లో ట్రాఫిక్ పోలీసులు పత్తా లేకుండా పోవడంతో గంటపాటైనా ట్రాఫిక్‌లో ఇరుక్కుని అవస్థలు పడుతున్నారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వాహనదారులు కోరుతున్నారు.

న్యాయం కావాలి..

భర్త ఇంటిముందు భార్య బైఠాయింపు

పెనుకొండ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాయయం చేయాలంటూ భర్త ఇంటి ముందు భార్య దీక్షకు దిగింది. పెనుకొండ మండలం అడదాకులపల్లిలోని భర్త ఇంటి ముందు భార్య మీనాక్షి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం బైఠాయించింది. అడదాకులపల్లికి చెందిన అనిల్‌కుమార్ గోరంట్లకు చెందిన మీనాక్షిని మూడు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగా వారు విడిపోయారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మీనాక్షి, తండ్రి ఆంజనేయులు, కుటుంబసభ్యులతో కలిసి అడదాకులపల్లి గ్రామానికి చేరుకుని భర్త అనిల్‌కుమార్ ఇంటి ముందు నిరాహారదీక్ష చేపట్టారు. 'నాకు నాభర్త కావాలి' అంటూ ఇంటి ముందు భీష్మించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను పిలిపించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది.


అడదాకులపల్లిలో భర్త అనిల్ ఇంటి ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న భార్య మీనాక్షి

సమరయోధుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

రొళ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. లోక్‌కల్యాణ్ ప్రజాసాక్షి సమితి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి విద్యానికేతన్, మురళీ ఇంగ్లీష్‌మీడియం స్కూల్, బాలాజీ రూరల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

అమరాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సైబర్ నేర నియంత్రణలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

పట్టణ నడిబొడ్డున ఉన్నా.. మట్టిరోడ్లే గతి

● చినుకుపడితే చిత్తడే
● ఇంకెన్నాళ్లీ కష్టాలంటున్న జనం

హిందూపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అందరిలాగే అనేక సంవత్సరాల నుంచి మునిసిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నాం. ఇల్లు నిర్మించుకుని 15ఏళ్లవుతున్నా ఇప్పటికీ మా ఇంటి ముందు మట్టిరోడ్డే దర్శనమిస్తున్నదంటూ పట్టణ నడిబొడ్డున ఉన్నజనం ఆగ్రహిస్తున్నారు. హిందూపురం పట్టణంలో గత ఐదేళ్ల వైసీపీ కాలంలో పట్టుమని కిలోమీటరు దూరమైనా ఒక్క సీసీ రోడ్డు వేసిన పాపానపోలేదు. ఒక్క మురుగు కాలువ కూడా నిర్మించలేదు. దీనికితోడు గత టీడీపీ హయాంలో 66 కోట్లు నిధులు మంజూరు చేయగా వైసీపీ వచ్చాక ఆ పనులు చేపట్టలేదు. దీంతో పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో మట్టిరోడ్లు అలాగే ఉండిపోయాయి. వర్షం వచ్చినపుడు అడుగు బయట పెట్టాలంటే జంకే పరిస్థితినెలకొంది. రాత్రిపూట పట్టణంలో నుంచి ఇళ్లవద్దకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు.


ప్రశాంతినగర్ ప్రాంతంలో మట్టిరోడ్డు

ఏళ్లు గడిచినా..

హిందూపురం పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీ, పులమతిరోడ్డు, గంగమ్మ గుడి, సీపీఐ కాలనీ యర్రకొట్టాల ప్రాంతం, ప్రశాంతినగర్ శివారు ప్రాంతం, మోతుకపల్లి, ఆర్టీసీకాలనీ, గుడ్డం ఏరియా, దండురోడ్డు ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకుని 15నుంచి 20ఏళ్లవుతోంది. కానీ ప్రతిసారి ఎన్నికలప్పుడు ఆరు నెలలలోపు రోడ్లు, మురుగు కాలువలు వేయిస్తామని హామీ ఇస్తున్నారు. అయినా ఇప్పటి వరకు ఈ ప్రాంతాల్లో సీసీ రోడ్డు వేసిన పాపానపోలేదు. దీనివల్ల వర్షం వచ్చినప్పుడు బయటికి రావాలన్నా జనం ఇబ్బంది పడుతున్నారు. ఆటోనగర్ కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఈ ప్రాంతాల్లో నివాసమున్నవారు ఇంకెన్నాళ్లు ఈ సమస్య అంటూ ఆవేదన చెందుతున్నారు.

త్వరలో రోడ్లు నిర్మిస్తాం: సంగం శ్రీనివాసులు, మునిసిపల్ కమిషనర్

పట్టణంలో శివారు ప్రాంతాలతోపాటు ఎక్కడెక్కడ సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలో గుర్తించాం. ఒకటి రెండు నెలల్లో ఎక్కువ సమస్యలున్న ఈ ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తాం.

వేడుకగా ఎడ్లబండ్ల పందేలు

సోమందేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగమాకులపల్లి గ్రామంలో శుక్రవారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. వంక గంగమ్మ పేరుతో నిర్వహించిన పోటీల్లో ముఖ్య అతిథిగా మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. లాటరీ ద్వారా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందాలను సరదాగా తీసుకోవాలన్నారు. గెలుపోటములు సహజమన్నారు. ఎవరు గెలిచినా వ్యక్తిగతంగా తీసుకోరాదని పేర్కొన్నారు. ఎడ్లబండ్ల పోటీలు కనువిందుగా సాగాయి. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో నిర్వాహకులు, గంగప్ప, నరసింహులు, నాయకులు వెంకటరమణ, వెంకటేశులు, నీరుగంటి చంద్ర, సిద్దలింగప్ప, సూరీ, తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.


లక్కీ డ్రా ద్వారా పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నేత వెంకటేశ్వర్లు


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

ముగిసిన క్రికెట్ టోర్నీ

సోమందేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నెలరోజులుగా సోమందేపల్లి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఫైనల్స్‌లో తల్హా టీమ్-సోమందేపల్లి ఎలెవెన్స్ టీమ్ తలపడ్డాయి. ఈ పోటీలో 74పరుగుల లక్ష్యాన్ని తలహా టీమ్ నిర్దేశించగా సోమందేపల్లి టీమ్ దానిని అధిగమించి విజేతగా నిలిచింది. గెలుపొందిన టీమ్‌కు తొగటవీరక్షత్రియ అధ్యక్షుడు సీసీ హరీ, టీడీపీ హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్ ట్రోఫీలు అందజేశారు. ఎస్‌సిఏ మెంబర్ జబీవుల్లా, టీడీపీ పట్టణ కన్వీనర్ వడ్డె సూరి, సుధీర్, బోయ శ్రీనివాసులు, మహేష్, ఆది, షాషా, మద్దిలేటి, మనోజ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుండీ తొలగించండి.. ప్లీజ్!

పెనుకొండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట పాఠశాల వద్ద ఆటో స్టాండ్‌కు అడ్డంగా ఉన్న చెత్తకుండీని తొలగించాలని కోరుతూ సీపీఐ, ఏఐటీయుసీ ఆటో యూనియన్ నాయకులు నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. శుక్రవారం సీపీఐ నాయకులు శ్రీరాములు, ఆటోయూనియన్ నాయకులు వినతిపత్రం అందిస్తూ గత 20ఏళ్లుగా ఆటోస్టాండ్ ఏర్పాటు చేసుకుని ఆటోల ద్వారా దాదాపు 150కుటుంబాలు జీవనం సాగిస్తున్నామన్నారు. ఆటో స్టాండ్ వద్ద చెత్తకుండీని ఏర్పాటు చేయడంతో వీధిలోని వారు గొర్రెలు, మేకలు, కోళ్లు కోసి వాటి వ్యర్థాలను కుండీలో వేస్తున్నారన్నారు. దీనివల్ల ఈ ప్రాంతమంతా దుర్వాసన వస్తున్నదని, ప్రయాణికులు ఎవరూ తమ ఆటోల వద్దకు రావడం లేదన్నారు. దయచేసి నగర పంచాయతీ అధికారులు చెత్తకుండీని ఈ ప్రాంతం నుంచి తొలగించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరాములు ఆటో యూనియన్ నాయకులు రమేష్‌నాయక్, నాగభూషణ, ఆనంద్, కమలేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టాలి

హిందూపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలోకి కొత్త సభ్యులను చేర్పించాలని కొల్లకుంట అంజినప్ప ఓ ప్రకటనలో కోరారు. శనివారం నుంచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. టెలిగ్రాంలో మైటీడీపీ యాప్‌లోకానీ, లేదా 9053419999 వాట్సప్ నంబరులోగాని సభ్యత్వ నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే పెనుకొండ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శనివారం నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు మండల కన్వీనర్ సిద్దయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని మడకశిర రహదారిలో టీడీపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన

అగళి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా అగళి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఐ వీరేష్‌తోపాటు సిబ్బంది విద్యార్థులు, ఉపాధ్యాలు, పోలీస్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు పోలీస్‌శాఖ పనితీరు, పోలీస్ విధులు, వారు వినియోగించే ఆయుధాలు, వాటి ప్రదర్శనపై అవగాహన కల్పించారు. సైబర్‌నేరాలు అరికట్టడంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.